సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 7 । అక్టోబర్ । 2023



నీటికుంటలు.. నిండుకుండలు!

కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ వంటిది జన్నారం అటవీ డివిజన్. వేసవిలో నీరుండేలా తవ్విన నీటి కుంటలతో వన్యప్రాణులు దాహం తీర్చుకుంటున్నాయి. 8లో ▸

జిల్లాకు కోర్టు మంజూరు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పలు నూతన కోర్టులను మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైంది. పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి అవకాశం ఉండడంతో పాటు భారం తగ్గనుంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ ఎదుట '104' ఉద్యోగుల ధర్నా

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో 104 సేవల ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనంతో పాటు ఏజెన్సీ విధానం రద్దు చేసి ట్రెజరీ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్‌కు అందజేశారు. ఇందులో సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

83వ రోజుకు 'డివిజన్' సాధన దీక్ష



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తూ..

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 83వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈమేరకు దీక్ష శిబిరం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎమ్మెల్యే బాపూరావ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లోపు డివిజన్‌గా మార్చకుంటే 200మంది గిరిజనులతో నామినేషన్ వేయిస్తామన్నారు.

మహిళలు నిర్భయంగా ముందుకు రావాలి

- ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఆదిలాబాద్‌టౌన్: వేధింపులకు గురవుతున్న మహిళలు మౌనం వీడి నిర్భయంగా ముందుకు రావాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థినులు, మహిళలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. గత సెప్టెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిపై తొమ్మిది కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్ డివిజన్‌లలో రెండు షీటీం బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆదిలాబాద్ బృందాన్ని డీసీఆర్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుశీల, సత్యమోహన్, ఉట్నూర్ బృందంలో వాణి శ్రీ, భాగ్య సిబ్బంది వినోద్‌తో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో యాక్ట్, షీటీం, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్‌క్రైమ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, ఆదిలాబాద్ షీటీం నం. 87126 59953పై సంప్రదించవచ్చని వివరించారు. ఐదు నిమిషాల్లోపు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే సైబర్‌క్రైమ్ ద్వారా మోసపోతే అత్యవసరంగా జాతీయ హెల్ప్‌లైన్ నం.1930ను సంప్రదించాలని సూచించారు.

'ఆశ'ల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని బస్టాండ్ ఎదుట గల రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు బ్రేక్!

- టీచర్ల బదిలీలపై హైకోర్టు స్టే
- మరోసారి నిలిచిన 'ఎస్జీటీ' ప్రక్రియ
- ముందుకు సాగని పదోన్నతులు
- అయోమయంలోఉపాధ్యాయులు



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: 'ఏ నిమిషానికి ఏమి జరుగునో.. ఎవరు ఊహించెదరు..' అనే సినీ గీతం ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు అచ్చంగా సరిపోతుంది. ఉదయం ఒక జీవో.. రాత్రికి రాత్రే మార్పులు, కోర్టు స్టేలు..ఇలా ప్రక్రియ ఎటు తేలకుండా అయోమయానికి దారితీస్తోంది. కేవలం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి ప్రక్రియ మాత్రమే సజావుగా సాగింది. మిగితావి గందరగోళానికి దారి తీస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని టీచర్లు గాబరా పడుతున్నారు. ప్రక్రియ చివరి అంకానికి వచ్చిందని ఊహించిన వారికి నిరాశే మిగులుతోంది. ఇప్పటికే టెట్ కారణంగా ఎస్జీటీలకు ఎస్ఏ పదోన్నతులు నిలిచిపోయాయి. అలాగే పండిట్ పీఈటీ అప్‌గ్రేడ్ కారణంగా స్కూల్ అసిస్టెంట్ తెలుగు, స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఉర్దూ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల బదిలీ ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. కోర్టు కేసుల కారణంగా ఎస్జీటీల పదోన్నతులను పక్కనబెట్టిన ప్రభుత్వం బదిలీలు చేపట్టేందుకు రీ షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 10న ఈ ప్రక్రియ ముగుస్తుందన్న తరుణంలో మళ్లీ కొంత మంది కోర్టుకు వెళ్లడంతో అర్ధంతరంగా నిలిచిపోవడం గమనార్హం.

అడుగడుగునా అడ్డంకులే..

ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి జనవరిలో షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరిలో ప్రక్రియ ప్రారంభమై మార్చిలో ముగియాల్సి ఉండగా, కొంత మంది కోర్టుకు వెళ్లడంతో దాదాపు ఏడు నెలల తర్వాత మళ్లీ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రభుత్వం గతనెల 3న ప్రక్రియను తిరిగి ప్రారంభించింది. ఈనెల 3తో పూర్తి కావాల్సి ఉండగా, అనేక అవాంతరాల కారణంగా ముందుకు సాగుతూ.. ఆగుతూ నత్తనడకగా మారింది. కేవలం పీజీహెచ్ఎం బదిలీలు, స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్ఎంలుగా పదోన్నతి మాత్రమే సజావుగా సాగాయి. ఈ ప్రక్రియకు సంబంధించి వారం రోజులకోసారి బదిలీ, పదోన్నతుల ఉత్తర్వులు విడుదల చేయడం, సెలవు రోజుల్లోనే విధుల్లో చేరడం జరిగిపోయింది. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్ బదిలీలు జరగగా, భాషా పండిత, పీఈటీ అప్‌గ్రేడ్ కారణంగా ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పీడీ ఉపాధ్యాయులకు బదిలీ చేపట్టలేదు. మిగతా వారంతా విధుల్లో చేరారు. బదిలీ ఉత్తర్వులు రాక వీరు నిరాశ చెందుతున్నారు. ఆ తర్వాత ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు పొందే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయాలని కొంత మంది టీచర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ప్రక్రియ మధ్యంతరంగా నిలిచిపోయింది. హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే.

కథ మొదటికి..

ఎస్జీటీ పదోన్నతులను పక్కనబెట్టిన రాష్ట్ర విద్యాశాఖ ఎస్జీటీ బదిలీలకు రీషెడ్యూల్ విడుదల చేసింది. దీంతో టీచర్లు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఆదివారం ఎస్జీటీలకు బదిలీ జరిగి ఉత్తర్వులు అందాల్సి ఉండగా, అంతలోనే మళ్లీ కొంత మంది ఎస్జీటీ పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపట్టాలని కోర్టును ఆశ్రయించడంతో కథ మొదటికొచ్చింది. ఈనెల 19 వరకు ప్రభుత్వం స్టే విధించినట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే ఈ ప్రక్రియ ముందుకు కొనసాగుతుందో.. లేదోనని కొంత మంది దిగాలు చెందుతున్నారు. ఇక రెండుమూడు రోజుల్లో కొత్త పాఠశాలలకు వెళ్తామని సంబరపడ్డ ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న గురువులు నిరుత్సాహంలో ఉన్నారు.

అంతా అయోమయం..

బదిలీ, పదోన్నతుల ప్రక్రియ గందరగోళం కావడంతో ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతులు కేటాయించడంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ స్థానంలో ఎస్జీటీలకు పదోన్నతులు జరిగి ఉంటే ఖాళీగా ఉన్న ఎస్ఏ పోస్టులు భర్తీ అయ్యేవి. ఎస్జీటీలకు పదోన్నతులు జరగకపోవడంతో పాఠశాలల్లో ఖాళీల ద్వారా విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయి. పదోన్నతులు జరుగుతాయా.. లేదా అని సందిగ్ధంగా ఉన్నారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మళ్లీ రీషెడ్యూల్ వస్తుందా.. బ్రేక్ పడుతుందా అనేది కోర్టు తీర్పుతో స్పష్టం కానుంది.

పదోన్నతి ప్రక్రియ వెంటనే చేపట్టాలి



బదిలీలపై హైకోర్టు ఇచ్చి స్టే ప్రకారం వెంటనే పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత పదోన్నతులు ప్రక్రియ జరుగుతుండగా, ప్రభుత్వం ఇలా అర్ధంతరంగా నిలిపివేయడం సరికాదు. సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. కోర్టులో ఉన్న కేసులపై స్టే తొలగించి వెంటనే పదోన్నతులు ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఎస్జీటీల బదిలీ చేపట్టాలి.

– వలభోజు గోపీకృష్ణ, టీయూపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

తాత్కాలికంగా బదిలీ ప్రక్రియ నిలుపుదల



ఎస్జీటీ బదిలీల ప్రక్రియను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలిపివేశాం. హైకోర్టు ఎస్జీటీ బదిలీలపై స్టే విధించింది. ఉన్నతాధికారులు ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన అనంతరం ఈ ప్రక్రియను ముందుకు సాగిస్తాం.

– ప్రణీత, డీఈవో

నెరవేరిన కల



ఉమ్మడి జైనథ్ మండల మ్యాప్



జీవో కాపీ

- సాత్నాల, భోరజ్ మండలాలు ఏర్పాటు
- జీవోనం.151 జారీ చేసిన ప్రభుత్వం
- యథావిధిగా జైనథ్ మండల పరిషత్ పాలన
- హర్షం వ్యక్తం చేస్తున్న కొత్త మండలాల ప్రజలు

జైనథ్: విస్తీర్ణం దృష్ట్యా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతి పెద్ద మండలమైన జైనథ్‌లోని సాత్నాల, భోరజ్ ప్రాంతాలను కొత్త మండలాలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 151ను శుక్రవారం విడుదల చేసింది. ఆగస్టు 19న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. నెల పాటు ప్రజల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించింది. తాజాగా ప్రభుత్వం ఫైనల్ జీవో విడుదల చేయడంతో ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరింది.

2019లో బీజం..

2014లో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభించింది. మొదట్లో జైనథ్‌లో భోరజ్, సాత్నాల మండలాల గురించి పెద్దగా ప్రజల నుంచి స్పందన లేకపోయినప్పటికీ, 2019లో భోరజ్, సాత్నాల ప్రాంత నాయకులు, ప్రజలు కొత్త మండలాల డిమాండ్‌ను ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు నిరసనలు సైతం చేపట్టారు. జైనథ్ మండలం విస్తీర్ణంలో పెద్దదిగా ఉండటంతో సాత్నాల, భోరజ్ వాసులకు మండల కేంద్రానికి వచ్చేందుకు ఇక్కట్లు తప్పేవికావు. ఒకే మండలంలో 42 పంచాయతీలు, 55 రెవెన్యూ గ్రామాలు ఉండటంతో అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది.

తీరనున్న కష్టాలు..

వాస్తవంగా జైనథ్ మండలం నైసర్గిక స్వరూపం కూడా మూడు రకాలుగా కనిపిస్తుంది. 44వ నంబర్ వైపు (పెన్‌గంగ వైపు) గ్రామాలు, సాత్నాల ప్రాజెక్ట్ వైపు ఉన్న గ్రామాలు, మధ్యలో జైనథ్ మండల కేంద్రానికి చుట్టూ ఉన్న గ్రామాలు. ఇలా మూడు ప్రాంతాల్లో పరిస్థితులు, భౌగోళిక వ్యత్యాసంతో పాటు సామాజిక, జీవన విధానాల్లో సైతం స్పష్టమైన తేడా కనిపిస్తుంది. సాత్నాల వైపు గిరిజన గ్రామాలు అధికంగా ఉండటం, భోరజ్ వైపు ఉన్న చాలా గ్రామాలు మహారాష్ట్రతో సరిహద్దులు పంచుకోవడంతో జైనథ్‌తో విడిపోయి ఉన్నామన్న భావన ఉండేది. దీంతో పాటు మండల కేంద్రానికి రాకపోకలకు గాను ఆయా గ్రామాల నుంచి నాణ్యమైన రోడ్డు రవాణా లేకపోవడం, వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం సాత్నాల, భోరజ్ నూతన మండలాలుగా ఏర్పాటు కావడంతో ఇక వారి కష్టాలు తీరనున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న జైనథ్ మండల పరిషత్‌పై దీని ప్రభావం వచ్చే ఎన్నికల వరకు ఉండదని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ రెండు కొత్త మండలాల పాలన సైతం జైనథ్ మండల పరిషత్ నుంచే కొనసాగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాత్నాల మండలం ఇలా..

జైనథ్ మండలంలోని 5 గ్రామాలు, బేల మండలంలోని 2, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని 5 గ్రామాలను కలిపి మొత్తం 12 గ్రామాలతో కొత్త సాత్నాల మండలం ఏర్పాటు అయింది.
జైనథ్‌లోని గ్రామాలు..: పార్డి–బి, పార్డి–కే, కాన్ప(మేడిగూడ), మాంగుర్ల,జామ్ని
ఆదిలాబాద్ రూరల్‌లోని గ్రామాలు..: రామాయి, జంబుల్‌ధరి
బేలలోని గ్రామాలు..: తోయగూడ, సైద్‌పూర్, సహేజ్, దౌన, సాంగ్వి


భోరజ్ మండలం ఇలా..

జైనథ్ మండలంలోని 27 రెవెన్యూ గ్రామాలు, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఒక గ్రామం కలిపి మొత్తం 28 గ్రామాలతో భోరజ్ మండలాన్ని ఏర్పాటు చేశారు.
అందులో..
జైనథ్ మండలంలోని గ్రామాలు..: గూడ, రాంపూర్–టి, గిమ్మ–కే, గిమ్మ–బి,హట్టిఘాట్, ఆకోలి, సిర్సన్న, భోరజ్, మిర్జాపూర్, పూసాయి, పిప్పర్‌వాడ, మాండగాడ, షేకాపూర్, కామాయి, డొల్లార, పెండల్‌వాడ, దాదాపూర్, కరణ్‌వాడీ, లేకర్‌వాడ, బాలాపూర్, సావాపూర్, హషీంపూర్, తరోడ, అవల్‌పూర్, ఫౌజ్‌పూర్, కోర్టా, కేదర్‌పూర్
ఆదిలాబాద్ రూరల్ నుంచి: గణేశ్‌పూర్

ఆమెదే ఆధిపత్యం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	వ్యత్యాసం
బెల్లంపల్లి	84,790	84796	06
చెన్నూర్	91,969	92,141	172
మంచిర్యాల	1,31,871	1,32,292	421
ఆసిఫాబాద్	1,11,878	1,12,766	888
ఖానాపూర్	1,06,985	1,10,667	3,682
ఆదిలాబాద్	1,15,835	119908	4,073
నిర్మల్	1,17,563	1,29,214	11,651
ముధోల్	1,19,910	1,26,102	6,192
సిర్పూర్	1,11,924	1,11,039	885
బోథ్	1,06,031	1,00,656	5,375



- ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- ఎనిమిది నియోజకవర్గాల్లో వారిదే పైచేయి..
- పురుషులతో పోల్చితే 31వేల మంది ఎక్కువ

కై లాస్‌నగర్: త్వరలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గెలుపోటముల నిర్ణయాధికారం అతివల చేతుల్లోనే ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో పురుష ఓటర్లతో పోల్చితే మహిళలే అధికంగా ఉన్నారు. వీరు తమ ఓటు హక్కు ద్వారా నాయకుల తలరాత మార్చగల శక్తిగా మారనున్నారు.

31,575 మంది అధికం..

ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలుండగా వీటి పరిధిలో మొత్తం 22,18,337 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్లు 10,93,381 మంది, మహిళా ఓటర్లు 11,24,956 మంది ఉన్నారు. పురుషులతో పోల్చితే 31,575 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో మహిళలు స్వల్పంగా..మిగతా నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో అధికంగా ఉన్నారు. అత్యధికంగా నిర్మల్ నియోజకవర్గంలో 11,651 మంది ఉండగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో ఆరుగురు ఎక్కువగా ఉన్నారు.

ఆ రెండింటిలో మాత్రం..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో 5,375 మంది, ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గాల్లో 885 మంది పురుషులు మహిళలతో పోల్చితే అధికంగా ఉన్నారు.

అల్పాహారంతో ఏకాగ్రత మెరుగు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థులతో అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

ఆదిలాబాద్‌రూరల్:విద్యార్థుల ఎదుగుదలకు అల్పాహారం దోహదపడడంతో పాటు వారిలో ఏకాగ్రత మెరుగవుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 'ముఖ్యమంత్రి అల్పాహార' పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర జెడ్పీ ఉన్నత శుక్రవారం ఆయన ఈ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన టిఫిన్ అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. బడి పిల్లల భవితకు ఇది వరమని, విద్యా వ్యవస్థలో మార్పునకు శ్రీకారం చుట్టనుందన్నారు. ఇందులో విద్యార్థులకు కావాల్సిన పోషకాల సమ్మేళనం ఉంటుందని తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ విద్యార్థులకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి తిన్నారు. నాణ్యత, రుచిపై వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఎంపీపీ గండ్రత్ రమేశ్,ఎంఈవో జయశీల, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, ఎంపీటీసీ గంగాధర్, సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు సీఎం కేసీఆర్ అల్పాహారం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్ యాదవ్, ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో జీవన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పోశెట్టి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో డ్రైడే



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రోజురోజుకు డెంగీ కేసులు పెరిగిపోతున్నాయి. ఈ మేరకు వైద్యారోగ్య శాఖాధికారులు అప్రమత్తం అయ్యారు. కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోనిరాంనగర్, ఖానాపూర్, తాటిగూడ తదితర కాలనీల్లో శుక్రవారం స్ప్రే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రతిరోజు డ్రైడే చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. డెంగీ బారిన పడినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. చికిత్స ద్వారా పూర్తిగా తగ్గించడం జరుగుతుందని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం



బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్మన్ జనార్దన్

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పేదింటి ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే చీరెలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆడపడుచులకు ఏటా చీరెలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అలాగే యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించుకునేందుకు వీలుగా పంచాయతీల వారీగా స్పోర్ట్స్ కిట్లను పంపిణి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, ఐటీడీఏ డైరెక్టర్ మాడవి మాన్కు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీడీవో రమేశ్, ఏవో రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ రాథోడ్ సుభాష్, షేక్ దాదేఅలి, సర్పంచ్‌లు రాథోడ్ విష్ణు, సునీత నారాయణ్, సుజాత పరమేశ్వర్, సుభద్రబాయి, పరమేశ్వర్ తదితరులున్నారు.

తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

తలమడుగు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల సమీపంలోని చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్‌ను శుక్రవారం సందర్శించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు వంటి రవాణాను పూర్తిగా అరికట్టేలా అనుక్షణం పర్యవేక్షించాలన్నారు. పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడంతో పాటు అవసరం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తనిఖీ వివరాలను ఎప్పటికప్పుడు కలెక్టరేట్ కార్యాయానికి అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ్‌మోహన్, ఆబ్కారి ఎస్సై ధనశ్రీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఇండియన్ బ్యాంక్ ప్రొబేషనరీ అధికారులు, గుమస్తాల పోస్టుల ఎంపికకు అభ్యర్థులకు 16నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీలకు 75, ఎస్సీలకు 15, బీసీలకు 10 సీట్లున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10లోపు http// studycircle. cvv. gov. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లీకేజీలకు మరమ్మతులు

కడెం: కడెం ప్రాజెక్ట్ 15, 8వ నంబర్ వరద గేట్ల లీకేజీలను ఆరికట్టేందుకు శుక్రవారం ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇటీవలే కౌంటర్ వెయిట్ విరిగిపడి దెబ్బతిన్న 15వ నంబర్ వరదగేటు పూర్తిగా కిందికి దిగకపోవడంతో గేటు నుంచి నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్ట్ సిబ్బంది వరద గేట్లకు గడ్డితో అడుకట్ట వేసి మరమ్మతులు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

తలమడుగు: గంజాయి సాగు చేసి రవాణా చేస్తున్నవారిని శుక్రవారం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సకినాపూర్ గ్రామానికి చెందిన మునేశ్వర్, రవి, రాములు మోటార్ సైకిల్‌పై గంజాయి రవాణా చేస్తుండగా గ్రామ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని పోలీసులు అడగగా, పంట పొలంలో తామే సాగు చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో వారి పంట పొలాలకు వెళ్లి పరిశీలించారు. ఏడు గంజాయి మొక్కలు సాగు చేసినట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని కాల్చివేశారు. గ్రామాల్లో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి విక్రయించినా, సాగుచేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, పట్టుబడ్డ ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారి నుంచి రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు గ్రామ సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ గురుకుల జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ అశోక్ ఇంద్రవెల్లి నుంచి ఉట్నూర్‌వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా పులిముడుగు వద్ద అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ గమనించి అశోక్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

నాలుగు మేకలు మృతి

ఇంద్రవెల్లి: విషపూరిత మందు తిని నాలుగు మేకలు మృతి చెందాయి. వివరాలు.. డోంగర్‌గాం పంచాయతీ పరిధి భీంజితండా గ్రామానికి చెందిన చౌహాన్ నాగోరావ్ తన మేకలను మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. పంటల రక్షణలో భాగంగా గుర్తు తెలియని వ్యక్తులు విషపూరిత మందును అటవీప్రాంతంలో ఉంచారు. దానిని తిన్న నాలుగు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఆరు మేకల పరిస్థితి విషమంగా ఉన్నట్లు మేకల యజమాని చౌహాన్ నాగోరావ్ తెలిపాడు. సంబంధిత అధికారులు మృతి చెందిన మేకలను పరిశీలించి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

నీటికుంటలు... నిండుకుండలు..!

- సత్ఫలితాలిస్తున్న నీటి కుంటలు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- తీరుతున్న వన్యప్రాణుల దాహార్తి



నిండు కుండలా కల్పకుంట



తాళ్లపేట్ రేంజ్‌లో నిండుగా నీటి కుంట

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ లాంటిది జన్నారం అటవీ డివిజన్. విస్తీర్ణంలో చిన్నగా ఉన్నా.. అత్యధిక వన్యప్రాణులు ఇక్కడే అవాసం ఏర్పరుచుకున్నాయి. నీలుగాయిలు, సాంబర్లు, చుక్కల దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, ముళ్లపందులు, కృష్ణ జింకలు, అడవి కుక్కలు ఇలా రకరకాల వన్యప్రాణులు జన్నారం అటవీ డివిజన్‌లో కనిపిస్తాయి. వన్యప్రాణులకు వేసవిలో దాహం తీర్చేందుకు గతంలో సాసర్ వెల్‌లు, నీటి తొట్లు ఏర్పాటు చేసేవారు. వాటిలో వేసవిలో ట్రాక్టర్ల ద్వారా నీటిని పోసేవారు. ఇది వన్యప్రాణులకు ఇబ్బందిగా మారింది. దీంతో అటవీ అధికారులు వినూత్నంగా ఆలోచించారు. వేసవిలోనూ అటవీ ప్రాంతంలో నీరుండేలా ఆలోచించి నీటి కుంటల తవ్వకాలు చేపట్టారు. వీటితో వేసవిలో వన్యప్రాణులు దాహం తీర్చుకుంటుండగా భూగర్భజలాలు పెరిగాయి.

మూడేళ్లలో 240 కుంటలు..

జన్నారం అటవీ డివిజన్‌లో గతంలో 100 నీటి కుంటలుండేవి. మాధవరావు ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు పలు రకాల ప్రయత్నాలు చేశారు. చివరికి వానాకాలంలో నీరు వృథా పోకుండా ఎక్కడికక్కడే నీటి కుంటల నిర్మాణం చేయాలని ఆలోచించారు. డివిజన్‌లో మూడేళ్లలో ఉపాధిహామీ పథకం కింద కొత్తగా 240 నీటి కుంటలు నిర్మించారు. వీటితోపాటు ట్రెంచ్‌ల తవ్వకాలు చేపట్టారు. దీంతో వానాకాలంలో వరదనీరు చేరి నీటి కుంటలు నిండు కుండల్లా మారాయి. వానాకాలంలో నీటికి అడ్డుకట్టలు వేస్తూ ఒడిసి పట్టడం ద్వారా వేసవిలో వీటి ఫలితాలు కనిపిస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన భూగర్భ జలాలు

అడవుల్లో నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. రెండేళ్లుగా ట్యాంకర్లతో నీటిని పోసే పద్ధతికి స్వస్తి పలికారు. గతంలో మాదిరిగా సాసర్‌వెల్, నీటి తొట్లు ఏర్పాటు చేయడం.. అందులో నీరు పోయడం లాంటి చర్యలు మానేశారు. వేసవిలో ర్యాంప్ వెల్‌లు నిర్మించారు. సహజసిద్ధంగా భూమి నుంచి నీరు ఊరేలా ర్యాంప్ వెల్‌లను తవ్వించారు. అందులోకి వన్యప్రాణులు దిగి నీరు తాగేందుకు వీలుగా ర్యాంప్‌లా ఏర్పాట్లు చేశారు. వీటిని బట్టి చూస్తే నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

70 చోట్ల ఊట కుంటలు

వేసవిలో కొన్ని నీటి కుంటలు ఎండిపోయినా ఊట కుంటలతో నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. డివిజన్‌లో 70 చోట్ల ఊట నీటితో కుంటలు ఏర్పాటు చేశారు. వేసవిలో ఇక ట్యాంకర్‌తో నీరు నింపాల్సిన అవసరం లేకుండా తగు చర్యలు చేపడుతున్నారు. నూతన టెక్నాలజీని ఉపయోగించి నీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నీరు పోసే విధానానికి స్వస్తి చెప్పాం



వేసవిలో నీటి సమస్య ఏర్పడి వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా సాసర్ వెల్‌లలో ట్యాంకర్ల ద్వారా నీరు పోసే పద్ధతి ఉండేది. నూతనంగా ఆలోచించి భూగర్భ జలాలను పెంచితే వేసవిలో సహజసిద్ధమైన నీటిని అందించవచ్చని నీటి కుంటల నిర్మాణం చేపట్టాం. దీని ద్వారా వేసవిలో భూగర్భ జలాలు పెరగడంతో ర్యాంప్‌వెల్, ఊట కుంటలు తవ్వించి సహజ సిద్ధమైన నీటిని వన్యప్రాణులకు అందిస్తున్నాం.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

పెంబి రైతువేదికలో కృషి మహోత్సవం



స్టాళ్లు పరిశీలిస్తున్న రైతులు

పెంబి: నీతి అయోగ్ చేపట్టిన అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సుమారు 150మంది రైతులతో ఏడు వ్యవసాయ అనుబంధ ప్రభుత్వ శాఖలు, వివిధ ప్రైవేట్ కంపెనీలు, ఎన్జీవోల భాగస్వామ్యంతో కృషి మహోత్సవంలో భాగంగా అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుజాత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ చేపట్టిన అస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా పెంబి మండల ఎంపిక కావడం హర్షణీయమన్నారు. రానున్న రెండు సంవత్సరాల కాలంలో మండల పరిధిలో మిశ్రమ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవసాయ అనుబంధ రంగాలైన డెయిరీ, పౌల్ట్రీ, తేనే టీగలు, పట్టుపురుగుల పెంపకం చేపట్టడం, జామ, మామిడి, ఆయిల్ పాం వంటి బహుల వార్షిక పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే ప్రణాళికలు రూపొందిచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రామారావు, ఏవో రవి, ఉద్యాన అధికారి మౌనిక, పశు వైద్యాధికారి విజయ్‌జాదవ్, ఏపీఎం గంగారెడ్డి, ఎస్బీఎం అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ విజయం తథ్యం’



సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

కడెం: ఖానాపూర్ నియోజవర్గంలో కాంగ్రెస్ విజయం తథ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ మేనిఫెస్టో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పొన్కల్ బ్యారేజ్ నుంచి ప్రత్యేక కెనాల్ ఏర్పాటు చేస్తామని, పొన్కల్ బ్యారేజ్ లెఫ్ట్ కెనాల్‌ను సరస్వతీ కెనాల్‌కు అనుసంధానం చేసి ఖానాపూర్, కడెం, పెంబి మండలాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని, అటవీ నిబంధనలు సడలించి, టైగర్‌జోన్ పరిధిలో ప్రజల ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ఖానాపూర్, జన్నారం మండలాల్లో డిగ్రీ, పెంబిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తామని, ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్‌ను కాదని, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ హిందూ, క్రిస్టియన్ కల్చర్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాథోడ్ రమేశ్ ఆరిపోయే దీపమని ఎద్దేవా చేశారు. తాను లంబాడాలకు వ్యతిరేకం కాదని, ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో జాతి కోసం మాట్లాడితే కొందరు రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు మండలంలోని సారంగపూర్, లింగాపూర్, ధర్మాజీపేట్, మాసాయిపేట్ గ్రామల్లో పర్యటించారు. కాంగ్రెస్ హామీలు వివరించారు. పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్‌యాదవ్, నాయకులు వాజీద్‌ఖాన్, భూషణం, రాజన్న, బబ్లూ, చాంద్‌పాషా, ధర్మయ్య, రమేశ్ తదితరులున్నారు.

28న కుమురంభీం వర్ధంతి

- ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహిద్దాం
- ప్రసంగాలు ఉండవు.. సాంస్కృతిక కార్యక్రమాలకే పెద్దపీట
- కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జోడేఘాట్‌లో సన్నాహక సమావేశం



జోడేఘాట్‌లోని భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రతినిధులు

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 28న కుమురంభీం 83వ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. జోడేఘాట్‌లో వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లను శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం మ్యూజియంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. వర్ధంతికి తరలివచ్చే ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం 24 మరుగుదొడ్లు ఉన్నాయని, తాత్కాలికంగా మరికొన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఐదు బస్సులు నడపాలని, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ నుంచి కూడా ప్రత్యేక బస్సులు వేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్టాళ్లు ఏర్పాటు చేసి ఐటీడీఏ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను గిరిజనులకు వివరించాలన్నారు. ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలన్నారు. దర్బార్‌లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ఎలాంటి ప్రసంగాలు ఉండవని, కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పెద్దపీట వేస్తామని తెలిపారు. ప్రత్యేక భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. మూడు రోజుల ముందు నుంచే వందమంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలని సూచించారు. రాయిసెంటర్ ఆధ్వర్యంలో వర్ధంతి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వర్ధంతికి వారం ముందు మరోసారి సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అప్పటివరకు అన్ని పనులు పూర్తిచేయాలన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే గుర్తింపు

సీఎం కేసీఆర్‌తోనే జోడేఘాట్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించారని, జిల్లాకు వచ్చి పోడు పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. 30 డబుల్ బెడ్రూం ఇళ్లకు త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. ఫారెస్టు అనుమతులు వస్తే వావుదాం నుంచి ఆసిఫాబాద్‌కు రోడ్డు వేస్తామన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న బావిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వరరావు, ఈఈ భీంరావు, డీఎంహెచ్‌వో తుకారాం, డీడీ రమాదేవి, ఏటీడీఏ పురుషోత్తం, ఐసీడీఎస్ పీడీ సావిత్రి, ఐకేపీ ఏపీడీ రామకృష్ణ, ఎంపీపీ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచ్ సోనీబాయి, నాయకులు ఆత్రం లక్ష్మణ రాజేశ్వర్, మడావి రఘునాథ్, భీంరావు, ధర్మూ తదితరులు పాల్గొన్నారు.

కుక్కర్ల పంపిణీని అడ్డుకున్న పోలీసులు

- మహిళలతో కలిసి కంది శ్రీనివాసరెడ్డి ఆందోళన



కుక్కర్ల పంపిణీని అడ్డుకుంటున్న పోలీసులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి తన కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కుక్కర్ల పంపిణీ శుక్రవారం రాత్రి ఆందోళనకు దారి తీసింది. పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్‌లో గల టీటీడీ కల్యాణ మండపంలో కుక్కర్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందు కోసం మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్య ఏర్పడుతుందంటూ పోలీసులు వాహనాల్లో ఉంచిన కుక్కర్లను సీజ్ చేశారు. ఆ వాహనాలను స్టేషన్‌కు తరలించేందుకు యత్నించగా మహిళలు అడ్డుకున్నారు. పార్టీ శ్రేణులు, మహిళలతో కలిసి పోలీసుల తీరును నిరసిస్తూ శ్రీనివాసరెడ్డి ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజల నుంచి తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే జోగు రామన్న అడుగడుగున అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తాను కష్టపడిన డబ్బుతో ఆడబిడ్డలకు ప్రెషర్ కుక్కర్లను పంపిణీ చేస్తుంటే సహించలేక ఎమ్మెల్యే కుట్రపూరితంగా పోలీసులను ఉసిగొల్పి కుక్కర్లను సీజ్ చేయించారని ఆరోపించారు. ఆయన మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. టోకెన్లు తీసుకున్న మహిళలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి జోగు రామన్న ఇంటిని ముట్టడించాలని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

ట్రిపుల్‌ఐటీ స్కిట్‌కు కలెక్టర్ బహుమతి



కలెక్టర్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు స్కిట్(వీధి నాటకం)కు కలెక్టర్ వరుణ్‌రెడ్డి రూ.10వేల బహుమతి ప్రదానం చేశారు. ఓటు హక్కు ప్రతీ పౌరుని బాధ్యత అనే నినాదంతో ప్రభుత్వం పోటీలు నిర్వహించింది. బాసర ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులు ‘ప్రభావం చూపుతుంది’ అనే పేరుతో ఐదు నిమిషాల స్కిట్‌ను నిర్మల్ జిల్లా ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ ఆకట్టుకుంది. ప్రతీ పౌరుడు ఓటుహక్కు వినియోగించుకోవాలని మతం, కులం ఆధారంగా చేసుకుని ఓటు వేయొద్దని స్కిట్‌లో ప్రదర్శించారు. నోటుకు ఓటు ద్వారా నాయకులను ప్రశ్నించే అధికారం కోల్పోతామని, ఇలా పలు అంశాలు ప్రస్తావిస్తూ ఈ స్కిట్‌ను ప్రదర్శించారు. ఈ స్కిట్‌కు కలెక్టర్ వరుణ్‌రెడ్డి రూ.10వేల బహుమతిని అందజేశారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అభినందించారు.

విషజ్వరంతో యువకుడి మృతి

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం (బీ) గ్రామానికి చెందిన రాథోడ్ సతీశ్ (32) విషజ్వరంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత మంగళవారం రాథోడ్ సతీశ్‌కు జ్వరం రాగా, మండల కేంద్రంలోని ఓ పీఎంపీ వద్ద చికిత్స చేయించారు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోగా నిర్మల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. విషజ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

నేరడిగొండలో బాలుడు..

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ కుమారుడు సయ్యద్ షాహ్రాన్ (10) విషజ్వరంతో మృతి చెందాడు. మూడురోజులుగా అతడికి జ్వరం రాగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. కాగా, చికిత్స పొందుతూ షాహ్రాన్ మృతిచెందాడు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం ఐబీ ప్రాంతంలో నివాసముంటున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన భూక్య వికాస్‌కుమార్ (38) ఈజీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య సాయంత్రం ఇంటికి వచ్చి తలుపులు తీయగా ఇంట్లో ఉరేసుకుని కనిపించాడు. ఆమె సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా, తన ఆత్మహత్యకు ఎవరూ బాధ్యులు కారని మృతుడు రాసిన లేఖ లభించింది. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు సంతానం ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఐరేని వంశీ (22) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన వంశీ ఉదయం తన ద్విచక్రవాహనంపై బస్టాండ్ వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో రాంనగర్‌లో యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మరో బైక్ ఢీకొట్టింది. దీంతో ఆయన కింద పడి స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బాబాయి విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఎన్న నవీన్ (24) గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ ఏడాదిన్నర క్రితం ధన్నూర్ గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి అతడు కోలుకోలేదు. నొప్పులు భరించలేక గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో పడి యువకుడి మృతి

భైంసా: బాసర గోదావరి నదిలో శుక్రవారం ఓ యువకుడు తెప్ప వదులుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. బాసర ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నిజామాబాద్‌లోని గాజులపేటలో నివసించే దుబ్బాక ఓడ్డయ్య (35) తన కూతురు పుట్టువెంట్రుకలు తీసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు వచ్చాడు. ఇందులో భాగంగా ఆనవాయతీగా నది నీటిలో తెప్ప వదిలేందుకు వెళ్లాడు. నదిలో తెప్ప వదిలేక్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి నీటమునిగాడు. కుటుంబీకులు అరవగా అక్కడున్న వారు అప్రమత్తమై నీటిలోకి వెళ్లగా అప్పటికే ఓడ్డయ్య మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబీకులు గుండెలు బాదుకుంటూ రోదించారు. విషయం తెలుసుకున్న ఎస్సై గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం అతడి కుటుంబీకులకు అప్పగించారు.

గోండురాజులకోట అభివృద్ధికి కృషి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, పీవో

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ గోండురాజుల కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తెలిపారు. శుక్రవారం స్థానిక కోట ఆవరణలో ఐటీడీఏ పీవో బాజ్‌పాయ్‌తో కలిసి శిలాఫలకం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలోని పురాతన కట్టడమైన గోండు రాజుల కోటను రూ.3.70 లక్షలతో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కోట చుట్టూ వాకింగ్ ట్రాక్, గోండురాజుల చరిత్రను తెలిపేందుకు మినీ థియేటర్, గార్డెన్‌ను అనేక రకాలుగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఉట్నూర్ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారనుందని తెలిపారు. ఇక్కడి ప్రజలకు ఆహ్లాదం పంచనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ భీంరావు, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, మర్సుకోల తిరుపతి, నాయకులు కందుకూరి రమేశ్, ఆశన్న, సోనేరావు, గిరిజన నాయకులు, కార్యకర్తలు, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి 8గంటల ప్రాంతంలో స్థానిక ఎస్సై సురేశ్ 32 బాటిళ్ల దేశీదారు పట్టుకుని కామ్లే నాగును అరెస్ట్ చేశారు. ఎవరైనా దేశీదారు తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని శ్రీగణేశ్ ఫర్టిలైజర్ షాపులో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న పాండే గణేశ్, ముర్కుటే రాంహరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డీ సునీల్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ముందస్తు సమాచారం ప్రకారం ఆకస్మికంగా శ్రీగణేశ్ ఫర్టిలైజర్ షాపును సందర్శించగా ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతూ ఇద్దరు పట్టుబడినట్లు తెలిపారు. వారి నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మట్కా, పేకాట ఆడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మన్నద్‌లో ఒకరు అదృశ్యం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన కొట్టువార్ విజయాబాయి గురువారం తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లిపోగా ఆమె ఆచూకీ తెలియడంలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్మద్ గ్రామానికి చెందిన విజయాబాయి గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ తెలియకపోగా ఆమె భర్త తుక్కుడేదాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ముగ్గురి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని మథుర కులానికి చెందిన ముగ్గురు శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న క్రమంలో రాంనగర్‌లో ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు మావల పోలీసులు తెలిపారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.